ముక్కు చెవులు మోస్తున్నాయని గ్రహించాను. దాంతో నిస్వార్థంగా పరోపకారం చేయాలి అని ముక్కు చెవులు బోధిస్తున్నాయని అనుకున్నాను."

"మరి అరటి పండు, మల్లెమాల, దీపాలు?" ప్రశ్నించాడు శిష్యుడు.

"దాని మెడ విరిచి తోలు తీసినా అరటి పండు తియ్యటి పండుని నోటికి అందిస్తుంది. మాల కట్టడానికి సూదితో తన గుండెల్లో గుచ్చినా మల్లెపూలు తమ పరిమళాన్ని దాచుకోక అందిస్తున్నాయి. నిప్పుతో తన తలని అంటించినా దీపం చీకట్లని పారద్రోలి వెలుగుని ఇస్తోంది. ఈ మూడూ తమకి అపకారం చేసినవారికి కూడా ఉపకారం చేస్తూ నాకా రెండో సూచనని తెలియచేసాయి." వివరించాడు సాధకుడు.

## 3. మూడు రకాల మనుషులు

ఓ కొత్త ఊరికి వచ్చిన ముగ్గురు సన్యాసులు ఉదయం భిక్షాటన చేసి ఓ చెట్టు కింద కూర్చున్నారు. వారు తమకి లభించిన ఆహారాన్ని పంచుకుంటూ ఇలా మాట్లాడుకోసాగారు.

"నే వెళ్ళిన ఇంటి వాళ్ళంతా చెకుముకి రాయిలాంటి వారు." చెప్పాడు మొదటి సన్యాసి.

"నే వెళ్ళిన ఇంటి వాళ్ళు స్పాంజ్‌లాంటి వారు." చెప్పాడు రెండో సన్యాసి.

వెంటనే మూడోవాడు ఇలా చెప్పాడు.

"అదృష్టం. నే వెళ్ళిన ఇంటివాళ్ళు మాత్రం తేనె పట్టు లాంటి వారు కాబట్టి మనం ఈ పూట కడుపు నిండా తినగలుగుతున్నాం."

వాళ్ళ సంభాషణ విన్న గుడికి వచ్చిన ఒకడు ఆగి వాళ్ళని అడిగాడు.

"మీరు ఉపయోగించిన పదాలు దేనికో పోలికలని సూచిస్తున్నాయని మాత్రం నాకు అర్థమైంది తప్ప మొత్తం అర్థం కాలేదు. దయచేసి మీరు మాట్లాడుకున్నదేమిటో నాకు వివరిస్తారా?"

" అలాగే. దానం చేసే వారిలో మూడు రకాల వారుంటారు. కొందరు చెకుముకి రాయిలాంటి వారు. దాన్నించి ఏదైనా తీసుకోవాలనుకుంటే దాన్ని

బాగా రాపిడి పెట్టాలి. ఐనా వచ్చేది అగ్గి రవ్వలు, ముక్కలే. కొందరు స్పాంజ్‌లాంటి వారు. స్పాంజ్‌లోని నీటిని పొందడానికి దాన్ని పిసకాలి. ఎంత ఎక్కువగా పిసికితే అంత నీరు వస్తుంది. ఇక తేనెపట్టు నించి తేనె పొందడానికి మనం ఏం చేయక్కరలేదు. అది నిండగానే తీయటి తేనె దానంతట అదే పట్టు నించి కారుతుంది." వారు అతనికి వివరించారు.

## 4. నాలుగో వర్గం

ఓ చోట హరికథా కాలక్షేపం జరుగుతోంది. 'ఎవరు స్వర్గానికి వెళ్ళడానికి అర్హులు?' అన్న మీమాంస శ్రోతల్లో కలిగింది.

"నిత్యం దేవాలయానికి వెళ్ళి అంగన్యాస, కరన్యాసాలతో పూజ చేయించే వారు అందుకు అర్హులు." ఓ వర్గం వారు చెప్పారు.

"కాదు. నిత్యం నిష్కామసేవతో బీదలని ఆదుకునే వారే స్వర్గానికి అర్హులు." ఇంకో వర్గం వారు చెప్పారు.

"కానే కాదు. 'నేనెవర్ని?' అన్న విషయాన్ని లోతుగా అధ్యయనం చేసే వాళ్ళే స్వర్గానికి వెళ్తారు." మరో వర్గం వారు చెప్పారు.

చివరికి వారంతా పండితుడైన ఆ హరికథని చెప్పే అతన్నే నిజం నిగ్గు తేల్చమని కోరారు. ఆయన చిన్నగా నవ్వి బదులు చెప్పాడు.

"ఓ తుఫాను రాత్రి జోరున వాన పడుతోంది. మీరు కారులో ఓ బస్ స్టాప్ పక్క నించి వెళ్తున్నారు. అక్కడ బస్ కోసం ఎదురుచూసే ముగ్గురు వ్యక్తులు వున్నారు. ఒకరు వెంటనే హాస్పిటల్‌కి చేరుకోకపోతే మరణించే అవకాశం గల ముసలావిడ. మరొకరు ఒకప్పుడు మీ ప్రాణాలు కాపాడిన మిత్రుడు. ఇంకొకరు మీరు ప్రేమించే మీ తల్లి. మీ కారులో ఒక్కరికే చోటుంది. వాళ్ళల్లో ఎవర్ని మీరు మీ కారులో ఎక్కించుకుంటారో చెప్తే ఎవరు స్వర్గానికి వెళ్తారో నేను చెప్తాను."

మళ్ళీ మూడు వర్గాలు ఏర్పడ్డాయి.

"నేను ముసలావిడని ఎక్కించుకుని హాస్పిటల్‌కి తీసుకెళ్ళి ఆవిడ ప్రాణాలు కాపాడుతాను." ఓ వర్గం వారు చెప్పారు.